

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
8 పేజీలు | ఆదివారం | నవంబర్ 19, 2023 | www.navatelangana.com



పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలి

- ఆసిఫాబాద్ అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ
- కాగజ్‌నగర్‌లో ఎన్నికల సెక్టోరల్ అధికారులు, రూట్ అధికారులతో సమావేశం

2లో...



పొరపాట్లు జరగకుండా విధులు నిర్వర్తించాలి

- రాష్ట్ర పరిశీలకులు రిటైర్డ్ ఐఏఎస్ అజయ్‌నాయక్, రిటైర్డ్ ఐపీఎస్ దిపక్
- నిర్మల్‌లో ఎన్నికల అధికారులతో సమీక్ష

5లో...

అండగా బలగం..దండిగా ప్రచారం..!

- అభ్యర్థుల గెలుపు కోసం ఇంటిల్లిపాది ప్రచారం
- ప్రత్యక్షంగా ఓటర్లను అభ్యర్థిస్తున్న కుటుంబీకులు
- చుట్టాలు..స్నేహితులు సైతం అండగా నిలుస్తున్న వైనం
- ఉమ్మడి జిల్లాలో ఆసక్తికరంగా మారుతున్న ఎన్నికల సమరం

ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ప్రక్రియ రసవత్తరంగా సాగుతోంది. బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచారంలో తలమునకలయ్యారు. తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో అభ్యర్థులకు అండగా నిలిచేందుకు వారి బంధుగణం అండగా నిలుస్తోంది. తమ వంతు సాయంగా ప్రచారపర్వంలో దిగుతున్నారు. ఇప్పటికే అభ్యర్థుల కుటుంబీకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ముమ్మర ప్రచారం చేస్తుండగా.. వివిధ గ్రామాలు, పట్టణాల్లో ఉన్న వారి చుట్టాలు సైతం తమ వారిని గెలిపించుకునేందుకు తాపత్రయ పడుతున్నారు. ఉదయమే గ్రామాలకు వెళ్లి జెండాలు చేతపట్టి..కార్యకర్తల సాయంతో ప్రచారాన్ని చేపడుతున్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులే కాకుండా వారి కుటుంబీకులు సైతం శాయశక్తులా కృషిచేస్తుండటం ఆసక్తికరంగా మారుతోంది. సకుటుంబ సపరివారమంతా ఎన్నికల క్రతువులో నిమగ్నం కావడం ప్రాధాన్యంగా మారింది.


సతీమణితో కలిసి ప్రేమ్‌సాగర్‌రావు ప్రచారం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కుటుంబంలో అందరూ కలిసి ఉండటంతో పాటు సంతోషమైనా..కష్టాలైనా కలిసి పంచుకోవాలనేది బలగం సినిమాలో చూపించారు. అచ్చం అలాగే తాజా ఎన్నికల్లోనూ అభ్యర్థులకు వారి బంధుగణం తోడయ్యారు. వారి చుట్టాలు, దగ్గరి సంబంధీకులు కలిసి పెద్ద బలగంలా వెంట నడుస్తున్నారు. ఎన్నికల్లో గట్టెందుకు అభ్యర్థులతో సమానంగా శ్రమిస్తున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు..ఉమ్మడి జిల్లాలో దాదాపు అందరూ అభ్యర్థుల తరుపున ప్రచారంలో తలమునకలయ్యారు. ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నుంచి 30మంది అభ్యర్థులు ఉండగా బీఎస్పీ, డీఎస్పీతో పాటు వివిధ పార్టీలు, స్వతంత్రుల తరపున మొత్తం 148మంది బరిలో నిలిచారు. ఇందులో కొందరు అభ్యర్థులు నోటిఫికేషన్ కంటే ముందుగానే ప్రచారాన్ని ప్రారంభించగా..మరికొందరు

మిగతా..2లో...


కుటుంబ సభ్యులతో కలిసి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రచారం


జోగు రామన్న తరపున జోగు ప్రేమేందర్ ప్రచారం



ఆసిఫాబాద్‌లో ఆదివాసీ ఓటర్లే లక్ష్యం..!

- ప్రధాన పార్టీల దృష్టి వారిపైనే
- ఇండిపెండెంట్లతో అధికార పార్టీకి తలనొప్పులు

వివరాలు..2లో...

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ప్రస్తుతం అన్ని పార్టీల టార్గెట్ ఆదివాసీ ఓటర్లే అయ్యారు. ఆదివాసులు ఇచ్చిన మాట మీద నిలబడడంతో పాటు నియోజకవర్గంలో అత్యధికంగా వారే ఉండడంతో గిరిజన ప్రాంతాల్లో అన్ని పార్టీల నాయకులు వారే లక్ష్యంగా ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఆదివాసుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు వరాల జల్లులు కురిపిస్తున్నారు. దీనికి తోడు స్వతంత్ర అభ్యర్థులు కూడా బరిలో ఉండడంతో ఆదివాసుల ఓట్లు చీలే అవకాశాలున్నాయి. ఆయా పార్టీలకు ఇండిపెండెంట్లు తలనొప్పులుగా మారారని చెప్పొచ్చు.

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల జాప్యాన్ని నిరసిస్తూ

రైతుల ఆందోళన

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెంబర్-7 శివారులోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల తాలుకూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల్లో జాప్యానికి నిరసనగా శనివారం బాధిత రైతులు పట్టణ ట్రాన్స్‌లో డీఈఈ కార్యాలయం ఎదుట బైటాయించారు. పక్షం రోజులుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆయకట్టులోని వరిపంటకు సాగునీరందక ఎండిపోతోందన్నారు. మరమ్మతులు చేపట్టాలని కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు స్పందించడం లేదని బాధిత రైతులు అమిత్ మండల్, అనూప్ మల్లిక్, మమకాగైన్, సుబ్బులు తెలిపారు. విద్యుత్ సమస్య ఏర్పడిన సందర్భాల్లో ఏఈ జగన్‌కు ఫోన్ చేస్తే పట్టించుకోవడం లేదన్నారు. ఏఈ పనితీరుపై విసుగు చెందామని రైతులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న అదికారులు, సిబ్బంది సమస్యలను అసలే పట్టించుకోవడం లేదని, జవాబుదారీతనం ఏమాత్రం లేదని బాధిత రైతులు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలి

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

ప్రతి పోలింగ్ కేంద్రంలో పూర్తి స్థాయిలో మౌళిక వసతులు ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు పాలనాధికారి దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల సెక్టోరల్ అధికారులు, రూట్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్‌కు రెండు రోజుల ముందుగానే అధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని, ఏదైన లోటుపాట్లు ఉంటే వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రధానంగా విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు ఉండాలన్నారు. ఏదైన గ్రామంలో విద్యుత్ సౌకర్యం లేనట్లయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లోని ఉద్యోగులు ఏ పార్టీకి అనుకూలంగా, ప్రతికూలంగా వ్యవహరించకుండా తమ విధులను నిర్వహించి పారదర్శకత పాటించాలని తెలిపారు. ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు ఎక్కడైన దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందులు ఉంటే ముందుగానే రహదారి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. తమకు కేటాయించిన విధులను నిర్వర్తించాలని, ఎవరైన గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఓమర్ హుస్సేన్, మన ఊరూ మన బడి జిల్లా సమన్వయకర్త భరత్ కుమార్, డీఎల్పీఓ సురేష్ బాబు, సెక్టోరల్, రూట్ అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీలను ఓడించడమే లక్ష్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలను ఓడించడమే తమ లక్ష్యమని సిపిఐ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి శ్యామ్‌నాయక్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఐ కూటమిగా ఏర్పడిందన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వాలను ఓడించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. బీజేపీ దేశంలో హిందూ మత వాదాన్ని పెంచి పోషిస్తుందని, అలాంటి పార్టీతో లోపాయికారిగా బీఆర్ఎస్ కుమ్ముక్కైందని పేర్కొన్నారు. పది సంవత్సరాలుగా ప్రజా సమస్యలను గాలికొదిలేసి కుటుంబ పరిపాలనను కొనసాగిస్తోందని పేర్కొన్నారు. దీన్ని అంతమొందించాలన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో సిపిఐ శ్రేణులకు, అనుబంధ సంఘాల నాయకులు కాంగ్రెస్ అభ్యర్థి శ్యామ్‌నాయక్‌ను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ, నాయకులు భోగే ఉపేందర్, పిడుగు శంకర్, దివాకర్, చిరంజీవి, రాకేష్, వికాస్, అల్లూరి లోకేష్ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థినుల క్రీడాభివృద్ధికి కృషి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని గిరిజన విద్యార్థినుల క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడ పాఠశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులు ఈనెల 15 నుంచి 17 వరకు మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో జాతీయస్థాయికి ఎంపిక కాగా వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినుల క్రీడా అభివృద్ధి కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే గిరిజన క్రీడ పాఠశాల నుండి అనేకమంది వివిధ ప్రాంతాల్లో పోటీలో పాల్గొన్నారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు మరింత మంది అత్యున్నత స్థాయికి ఎదిగే విధంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన నందిని, సోని, సత్యశీల, నాగేశ్వరిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడా అధికారి బండ మీనారెడ్డి, క్రీడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు, ఏసీఎంఓ పి.ఉద్ధవ్, ఏటీడీఓ క్షేత్రయ్య, జీసీడీఓ శకుంతల, పాఠశాల శిక్షకులు అరవింద్, విద్యాసాగర్, అథ్లెటిక్స్ కోశాధికారి లక్ష్మణ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అండగా బలగం..దండిగా ప్రచారం..!

(మొదటి పేజీ తరువాయి)

మాత్రం నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మొదలుపెట్టారు. ఉదయం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఆయా గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో తిరుగుతూ ప్రజలను తమవైపు తిప్పుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. వీరికి తోడు అదనంగా వారి బంధుగణం తోడుకావడంతో ప్రచారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అభ్యర్థులు వెళ్లిన చోట్ల కాకుండా ఇతర ప్రాంతాల్లోకి వెళ్లి వారి తరఫున ప్రచారం ముమ్మరం చేస్తూ చేదోడుగా నిలుస్తున్నారు.

చుట్టాలు సైతం ప్రచారంలోకి..!

అభ్యర్థులకు సంబంధించి దగ్గరి బంధువులతో పాటు దూరపు చుట్టాలు సైతం తమ వాడు పోటీ చేస్తున్నాడనే కారణంగా ఆయా ప్రాంతాల్లో జెండాలు, మేనిఫెస్టోలు, గుర్తులను పట్టుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంకా ఏయే గ్రామాల్లో వారికి చుట్టాలున్నారో ఆరా తీస్తూ ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు. మరికొందరు వారి సామాజిక వర్గాలను సైతం కలుస్తూ మద్దతు ఇవ్వాలని.. గెలిచిన తర్వాత అవసరమైన సహాయం చేసేలా చూస్తామంటూ భరోసా ఇస్తున్నారు. వారితో పాటు చుట్టుపక్కల పరిచయస్తులతోనూ మాట్లాడుతూ ఓటు వేసేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా పల్లెలు, పట్టణాల్లో తమ వారిని గెలిపిస్తే చేపట్టే అభివృద్ధి పనులు వివరించడంతో పాటు పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పోలింగ్‌కు మరో పదకొండు రోజులు మాత్రమే ఉండటంతో అభ్యర్థులతో పాటు వారి ఇంటిల్లిపాది ప్రచార పర్వాన్ని మరింత ముమ్మరం చేస్తున్నారు. క్షణం తీరిక లేకుండా గ్రామాలను చుట్టి వస్తూ అభ్యర్థులకు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో ఎవరి బలగం...ఎవరిని గెలిపిస్తుందో డిసెంబర్ 3వ తేదీన తెలిపోనుంది.

ఆసిఫాబాద్‌లో ఆదివాసీ ఓటర్లే లక్ష్యం..!

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నియోజకవర్గంలో 2లక్షల24 వేల ఓటర్లు ఉన్నారు. ఇందులో 63వేల వరకు ఆదివాసీ ఓటర్లు ఉన్నారు. తిర్యాణి, కెరమెరి, వాంకిడి, జైనూర్, నార్నూర్, గాదిగూడ, సిర్పూర్(యు), లింగాపూర్, ఆసిఫాబాద్ మండలాల్లో ఆదివాసులు ఎక్కువ. ఇప్పుడు అందరి చూపు వీరిపై పడేలా చేసింది. ప్రధాన పార్టీలు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ఆదివాసీ ఓటర్లను లక్ష్యంగా చేసుకున్నారు. గిరి గ్రామాల్లో పర్యటిస్తూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఆదివాసులు మాట మీద నిలబడతారని నానుడి ఉండడంతో వారు మాట ఇస్తే చాలని నాయకులు భావిస్తున్నారు.

ప్రధాన పార్టీ నాయకుల్లో ఆందోళన

గతంలో లంబాడీ, ఆదివాసీ ఉద్యమం నియోజకవర్గంలో పెద్ద మొత్తంలో జరిగిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఇప్పుడు ఇదే ప్రధాన పార్టీ అభ్యర్థుల్లో ఆందోళన కలిగిస్తోంది. కాంగ్రెస్, బీజేపీ లంబాడీ తెగకు చెందిన వారికి టికెట్ కేటాయించడంతో ఆదివాసుల ఓట్ల ప్రభావం పడే అవకాశం ఉన్నట్టు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో కూడా ఇదే చర్చ కొనసాగుతోంది. బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి ఆదివాసీ కావడంతో ఎక్కువ మంది ఆమె వైపు మొగ్గుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఇదే విషయమై ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలకు మింగుడు పడడం లేదని తెలుస్తోంది. రెండు తెగల మధ్య వైరం వల్ల ఆదివాసీ ఓట్లు అధికార పార్టీ అభ్యర్థి ఆదివాసీ మహిళలకే పడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థులతో తలనొప్పులు

మూడు ప్రధాన పార్టీల్లో కేవలం బీఆర్ఎస్ మాత్రమే ఆదివాసీ మహిళకు టికెట్ కేటాయించింది. నియోజకవర్గంలో ఆదివాసీ ఓటర్లు ఎక్కువ ఉండడం, బీఆర్ఎస్ అభ్యర్థి ఆదివాసీ కావడంతో ఓటర్లు ఆమె వైపే ఉంటారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ టికెట్ ఆశించి భంగపడిన కొట్నాక్ విజయ్, సిడాం అన్నిగ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. వీరు ఆదివాసీ ఓట్లు చీల్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇది అధికార పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఆదివాసులు కొంత మంది తుడుం దెబ్బలో పని చేయడం, దానికి జిల్లా అధ్యక్షునిగా కొట్నాక్ విజయ్ వ్యవహరించడంతో ఓట్ల పరిస్థితి ఎలా ఉంటుందనేది అంచనా వేస్తున్నారు. ఏదేమైనా ఓట్లు చీలకుండా అధికార పార్టీ నాయకులు ముందస్తు వ్యూహాలు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఆదివాసుల ఓటింగ్‌పైనే గెలుపోటములు నిర్ధారణయ్యే అవకాశముంది.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో సమస్యలకు పరిష్కారం

● పంటలు నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తా ● గడ్డం వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-జైపూర్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని, ప్రభుత్వం ఏర్పాటు అనంతరం నియోజకవర్గంలో ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని చెన్నూర్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం రామారావుపేట్, ఇందారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు జైనొద్దీన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రోడ్ షోలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో పంటలు నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అధికారంలో లేనప్పుడే సమస్యల పరిష్కారం కోసం ట్రస్టు ద్వారా సహాయ సహకారాలు అందించడం జరిగిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాదిరిగా హామీ ఇచ్చి మర్చిపోయే వ్యక్తిని కానని, ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో పాటు మేనిఫెస్టోల్లో పేర్కొన్న విధంగా అంచెలంచెలుగా అమలు చేస్తామని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గం నుండి బాల్క సుమన్‌ను పంపించాలంటే హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు



నామాల సత్యవతి తిరుపతి, పాలమాకుల లింగారెడ్డి, నాయకులు చల్ల సత్యనారాయణరెడ్డి, చల్ల విశ్వంబర్‌రెడ్డి, సుంకరి శ్రీనివాస్, ముదాం రమేష్, తొగరి శ్రీనివాస్, బేతు తిరుపతి, గుడెల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళా చట్టాలు, ఆర్థిక సాధికారతపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త శారద అన్నారు. శనివారం లైంగిక వేధింపుల నిరోధక, నిషేధ, పరిష్కార చట్టం – 2013పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు సామాజిక, ఆర్థిక, వ్యవస్థాపక రంగాలలో రాణిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా అభివృద్ధి చెందాలన్నారు. పని ప్రదేశాలలో మహిళా ఉద్యోగినులు, మహిళా కార్మికులపై జరుగుతున్న లైంగిక వేధింపులను ఆత్మస్థైర్యంతో ఎదుర్కొనేందుకు చట్టం తెలుసుకొని ఉండాలని తెలిపారు. గృహహింస నిరోధక చట్టం 2005, వివాహ తప్పనిసరి నమోదు చట్టం 2002, వరకట్న నిషేధ చట్టం 1961, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిరోధక చట్టం 1964 ఇతర మహిళా హింస చట్టం, మహిళా సంబంధిత చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, మహిళ అభివృద్ధితో కుటుంబం, దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం ఆర్థిక నిపుణులు సాగర్ మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం బ్యాంకుల ద్వారా అందించే ఆర్థిక



చేయూత పథకాలు, బీమా పథకాలు, నెట్ బ్యాంకింగ్, హెల్ప్‌లైన్ తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్ఇడబ్ల్యూ అకౌంటెంట్ మమత, మెడికల్ ప్రాజెక్టు అధికారి వినోద్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పిఎస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



భిక్షాటన చేపట్టిన ఉద్యమకారులు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని నిరసిస్తూ పట్టణంలో ఉద్యమకారులు వినూత్న నిరసనకు దిగారు. ప్రభుత్వం ఉద్యమకారులను బిచ్చగాళ్లను చేసిందని ఆరోపిస్తు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా బిచ్చగాడి వేషధారణ వేసి పలు షాపుల్లో తిరుగుతూ బిచ్చం ఎత్తుకుంటూ వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యమకారుడు ఆంజనేయులు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఉద్యమకారులను సీఎం కేసీఆర్ రోడ్లపైకి తీసుకొచ్చారని విమర్శించారు. ఉద్యమకారులను సీఎం మోసం చేశారని మండిపడ్డారు.

జోరుగా బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలో శనివారం బీఆర్ఎస్ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఖానాపూర్ పట్టణంలోని శివాజీనగర్, విద్యానగర్, పద్మావతినగర్, అంబేద్కర్‌నగర్, శాంతినగర్, శివాజీ నగర్‌లో కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులు గురించి, ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని కోరారు. ఖానాపూర్ అభివృద్ధి జరగాలంటే కారుగుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాథోడ్ రాము నాయక్, కార్యకర్తలు ఉన్నారు.



బీఆర్ఎస్ గెలుపు ఖాయం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

బీఆర్ఎస్ నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గెలుపు ఖాయమని ఐకేరెడ్డి కోడలు అల్లోల దివ్యారెడ్డి అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని చామన్‌పల్లి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కారుగుర్తుకు ఓటేసి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మునుపెన్నాడు లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కొరిపెల్లి కృష్ణారెడ్డి, సర్పంచ్ పడిగెల గంగాధర్, నాయకులు బొమ్మెన రాజేందర్, మధు, శ్రీనివాస్, సుదర్శన్, మహిపాల్‌రెడ్డి, నవీన్, మోహన్‌రెడ్డి, గంగారెడ్డి పాల్గొన్నారు.

ఒక పార్టీలో ఉంటూ... మరో పార్టీకి ప్రచారం

- ఖానాపూర్‌లో అంతుపట్టని కార్యకర్తల తీరు

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్ నియోజక వర్గంలో ఓ పార్టీ కార్యకర్తలు చేస్తున్న ఎన్నికల ప్రచారం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. తాము కొనసాగుతున్న పార్టీ అభ్యర్థితో నమ్మకంగా ఉంటూనే అంతర్గతంగా ప్రచారం మాత్రం మరో పార్టీకి చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరు అనుసరిస్తున్న తీరుపట్ల స్తానికంగా చర్చసాగుతోంది. ఖానాపూర్ నియోజకవర్గంలో 11మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. నియోజకవర్గంలో త్రిముఖ పోటీ ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్యనే పోటీ కనిపిస్తోంది. బీఆర్ఎస్ నుంచి భూక్యా జాన్సన్ నాయక్, కాంగ్రెస్ నుంచి వెడ్మ బొజ్జు పటేల్, బీజేపీ నుంచి రమేష్ రాథోడ్ పోటీలో ఉన్నారు. సదరు పార్టీల్లో ఏండ్ల నుంచి రాజకీయంగా ఎంతో అనుభవం కలిగి ఉన్న నాయకులు, కార్యకర్తలు పనిచేస్తున్నారు. వీరిలో పలువురు కార్యకర్తలు తామున్న పార్టీ కోసం శ్రమిస్తుండగా, మరి కొందరు తమ అభ్యర్థిని నమ్మిస్తూ ప్రత్యర్థి అభ్యర్థికి మద్ధతుగా ప్రచారం చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలువురు కార్యకర్తలు ప్రతిష్ట కోసం అభ్యర్థిని గెలిపించడమే ధ్యేయంగా పనిచేస్తుండగా, మరికొందరు ఆర్థిక లబ్ధి కోసం పనిచేస్తున్నట్టు పేర్కొంటున్నారు. ఈ సమస్య ఓ ప్రధాన పార్టీలో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం చేస్తున్న కార్యకర్తల శైలిపై సదరు అభ్యర్థి సైతం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కార్యకర్తలు అనుసరిస్తున్న ఇలాంటి విధానాలు అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావితం చూపిస్తాయని పరిశీలకులు పేర్కొంటున్నారు.

హాజరు శాతం పెంచేందుకు కృషి చేయాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని ప్రాథమిక పాఠశాల రాచాపూర్‌లో నిర్వహించిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశానికి రూమ్ టూ రీడ్ ప్రోగ్రాం డైరెక్టర్ గోవర్ధన్ హాజరై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పాఠశాలలోని విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి చేయాల్సిన కృషి గురించి ఉపాధ్యాయులుకు వివరించారు. ప్రతిరోజు విద్యార్థులు క్రమం తప్పకుండా బడికి హాజరయ్యేటట్లు తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని కోరారు. పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భాగ్యస్వామ్యం గురించి చర్చించారు. గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటింటా చదువుల పంట అప్లికేషన్‌ను డౌన్లోడ్ చేసుకొని క్రమం తప్పకుండా పాఠలను వినేలాగా చూడాలని తల్లితండ్రులకు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో అమలు చేస్తున్న అల్పాహార పథకం గురించి, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దిలీప్ కుమార్, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మెన్ దొంతుల రాజ, క్లస్టర్ సీఆర్పీ సుధాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతే బీఆర్ఎస్ ధ్యేయం

- నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ అధికార ప్రతినిధి, దళిత సంఘ నాయకులు ముడుసు సత్యనారాయణ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

దళితుల అభ్యున్నతే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ అధికార ప్రతినిధి ముడుసు సత్యనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని మల్లాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలో దళితుల మీద జరుగుతున్న దాడులు గురించి స్థానికులకు వివరించారు. తెలంగాణ స్వరాష్ట్రంలో దళిత సమాజ అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. దళితబంధు పథకం దేశంలో మరెక్కడా లేదని, రానున్న రోజుల్లో ప్రతి దళిత వర్గం అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ అభ్యర్థిని ఆదరించాలని కోరారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ప్రతి గ్రామంలో దళిత సంక్షేమ భవనాలు, అంబేద్కర్ పేరిట దేశంలోనే గొప్పగా సచివాలయం నిర్మించిన ఘనత బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంక్షేమ నాయకులు వెలమల రాజేశ్వర్, ఎంపీటీసీ రమేష్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, దళిత సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ముడుసు సత్యనారాయణ

శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన డీఐఈఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈఓ

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అగ్రికల్చర్ క్రాప్ ప్రొడక్షన్ విద్యార్థులకు, ఓఏ, ఈటీ విద్యార్థులకు శనివారం జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ట్రైనింగ్ సెంటర్‌ను డీఐఈఓ జిల్లా అధికారి జాదవ్ పరశురాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడారు. పలు ప్రశ్నలు అడిగి వాటి సమాధానాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ట్రైనింగ్‌ను ప్రతి విద్యార్థిని విద్యార్థులు తప్పకుండా వినియోగించుకోవాలని అన్నారు. ఉద్యోగ సమయంలో జాబ్ ట్రైనింగ్ సర్టిఫికెట్ అందరు విద్యార్థులు కలిగి ఉండాలని సూచించారు. ఈ కోర్సుల ద్వారా ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హమీద్, అధ్యాపకులు గడిపాలి సుభాష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

స్టడీ అవర్స్ పక్కాగా నిర్వహించాలి

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి గోపీచంద్

నవతెలంగాణ-లక్ష్మణచాంద

స్టడీ అవర్స్ పక్కాగా నిర్వహించాలని, అత్యుత్తమ ఫలితాలే లక్ష్యంగా పని చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి గోపీచంద్ అన్నారు. శనివారం రాచాపూర్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల త్రైమాసిక పరీక్షల జవాబు పత్రాలను పరిశీలించారు. అదేవిధంగా వారి హాజరు శాతాన్ని పరిశీలించారు. ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. స్టడీ అవర్స్‌ని చక్కగా నిర్వహించాలని, సకాలంలో సిలబస్‌ని పూర్తి చేయాలని ఆధ్యాపకులకు ఆదేశించారు. చదువులో వెనుకబడినటువంటి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సంతోష్ కుమార్, ఏటీపీ నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ముడుసు సత్యనారాయణ

భార్య జ్ఞాపకార్థం విద్యార్థులకు పుస్తకాల అందజేత

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో శనివారం పోషకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల అభివృద్ధి గురించి, సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా కోడె నవీన్ అతని సతీమణి వినీల జ్ఞాపకార్థం ఇరవై మంది విద్యార్థులకు రూ.2వేల 500 విలువ గల గురుకుల ప్రవేశ పరీక్ష పుస్తకాలు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తరుపున ప్రధానోపాధ్యాయులు వెంకట్ నర్సయ్య ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుంధతిదేవి, చంద్రశేఖర్, మమత, విమల విద్యార్థులు, పోషకుల పాల్గొన్నారు.

మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతున్న నాయకుడు మందకృష్ణ మాదిగ అని నాయకులు అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని అనుకుంటలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి ధన్యవాదలు తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన మాదిగల విశ్వరూప సభలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్గీకరణపై హామీ ఇవ్వడంతో మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించామని అడ్డూరి ఆశన్న అన్నారు. 30 సంవత్సరాల నుండి పోరాడుతున్న వ్యక్తి మందకృష్ణ మాదిగని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే ఎస్సీ పేద ప్రజలందరికీ మేలు జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికి ఉద్యోగం, ఉపాధి అవకాశాలతో పాటు ఆర్థికంగా ఎదుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుభాష్, రాజు, గంగన్న, మహిళలు గంగాదేవి, ప్రేమల, చిన్నక్క, ఆశమ్మ పాల్గొన్నారు.

గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం

నవతెలంగాణ-తలమడుగు

కాంగ్రెస్ అభ్యర్థి ఆడే గజేందర్ తరపున జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని దేవాపూర్ గ్రామంలో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ గణేష్ రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం కోసం 12 వందల మంది యువకుల ప్రాణాలను బలిదానం చేసుకుంటే కేవలం ఒక కుటుంబానికే తెలంగాణ వచ్చిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీల మోసపూరిత వాగ్దనాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. చేతి గుర్తుకు ఓటేసి ఆడే గజేందర్‌ను



గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజేశ్వర్, నాయకులు ప్రకాష్ రావు, వెంకన్న యాదవ్, రమేష్, శ్రీనివాస్ పటేల్, దేవన్న, దేవ్‌రావు, గణేష్, సుభాష్, లింగన్న, నర్సింలు, కిష్టన్న, గంగయ్య, విలాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహనా సదస్సు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బాలిక, మహిళ చట్టాలపై జిల్లా కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో మహిళ సాధికారత, సఖి కేంద్రంల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ చట్టాలు, మహిళ సాధికారత, హక్కులు, టోల్ ఫ్రీ నెంబర్స్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, లింగ వివక్షత, లింగ సమానత్వం, పోక్సో చట్టం, బాల్య వివాహాలు వల్ల నష్టాలు, సఖి కేంద్రం సేవలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళ సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ యశోద ఉన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-నార్నూర్

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. శనివారం ప్రచారంలో భాగంగా గాదిగూడ మండలంలోని ఖడోళీ గ్రామంలో పార్టీ అభ్యర్థి కోవా లక్ష్మీతో కలిసి కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. పార్టీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో పార్టీ గెలిస్తే తండాలు, గుడెలు మరింత అభివృద్ధి చెందుతాయన్న విషయాలను తెలియజేయాలన్నారు. అనంతరం గ్రామంలో ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటేసి కోవ లక్ష్మీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో



పార్టీ నాయకురాలు మర్సుకొల సరస్వతి, ఎంపీపీ ఆడా చంద్రకళ రాజేశ్వర్, వైస్ ఎంపీపీ యోగేష్, ఎంపీటీసీ కిరణ్, మండల అధ్యక్షులు పుసం బాదిరావ్, కో ఆప్షన్ సభ్యుడు జాడే బాబు, సర్పంచ్ గజానంద్ నాయక్ పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడాలేని విధంగా అభివృద్ధి

నవతెలంగాణ ఆదిలాబాద్ రూరల్

దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణను సీఎం కేసీఆర్ అభివృద్ధి చేశారని ఎంపీపీ గంట్రత్ రమేష్ అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రామన్న తరపున ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ మేనిఫెస్టోలను అందిస్తు మూడోసారి అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాలను వివరించారు. కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే జోగు రామన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జంగు పటేల్, మాజీ ఎంపీపీ సెవ్వ జగదీష్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కనక రమణ, గొల్ల కురుమ నాయకుల సంఘం అధ్యక్షుడు గంగయ్య యాదవ్, సర్పంచ్ చందర్‌రావు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌, బీజేపీలు అంతర్గత మిత్రులు

- కర్నాటక మంత్రి జమీర్ ఖాన్
- హస్తం గూటికి ఎంఐఎం నాయకులు



మంత్రితో పాటు కాంగ్రెస్ అభ్యర్థిని సత్కరిస్తున్న మాజీ ఎంఐఎం నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్, బీజేపీలు అంతర్గత మిత్రులని, వారిని నమ్మి ఓటేస్తే నట్టేట మునిగినట్టేనని కర్నాటక మంత్రి జమీర్ ఖాన్ అన్నారు. ఆర్ఎస్ఎస్ నుండి వచ్చాడంటూ ఆదిలాబాద్ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డిపై కొన్ని దుష్టశక్తులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని అన్నారు. పట్టణంలోని టీఎన్జీఓ భవనంలో శనివారం ఎంఐఎం పట్టణ ప్రధాన కార్యదర్శి రషీద్ ఉల్ హక్ ఆధ్వర్యంలో భారీగా కాంగ్రెస్‌లో చేరారు. వారికి మహారాష్ట్ర మాజీ మంత్రి అనిస్ అహ్మద్, అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ సర్కార్‌ను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, మార్పు కోసం కాంగ్రెస్‌నే కోరుకుంటున్నారన్నారు. సీఎం కేసీఆర్ జూటా మాటలు, అమలు కాని హామీలను ముస్లిలు ఇక నమ్మొద్దని సూచించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామి చెప్పి పదేండ్లు అయిన ఎందు అమలు చేయలేదని ప్రశ్నించాలన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులు కబ్జాలకు గురవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ఎప్పుడూ అబద్దపు హామీలివ్వదని, చెప్పినవే చేస్తుందని, చేసినవే చెబుతుందని తెలిపారు. అటు బీజేపీ అచ్చేదిన్ అయేగా అంటూ నమ్మించి మోసం చేసిందని, కానీ ప్రజలు చ్చేదిన్ వచ్చిందన్నారు. ప్రతి అకౌంట్‌లో రూ.15 లక్షల హామీ పచ్చి బూటకమని వ్యాఖ్యనించారు. తాను వచ్చేంతవరకు జోగు రామన్న, పాయల శంకర్‌లు ఉమ్మడి నాటకాలను ప్రశ్నించేవారే లేరని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కొలేక అక్రమంగా తనతో పాటు కుటుంబ సభ్యులపై ఎన్నో కేసులు పెట్టించారన్నారు. ప్రజల కోసం వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. గత రెండు ఎన్నికల హామీలను అమలు చేయలేని జోగు రానమన్న మళ్లీ కొత్త అబద్దాలతో మోసం చేయాలనుకుంటున్నారని ఆరోపించారు. తన యుద్ధం ఇక్కడి యువత భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. ఏదైన ఒక తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు ద్వారా 10 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. తనను ఆశీర్వాదించి గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీలో పూర్వవైభవం సంతరించుకుంటోందని కర్నాటక మంత్రి జమీర్ ఖాన్, మహారాష్ట్ర మాజీ మంత్రి అనిస్ అహ్మద్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు మహ్మద్ రఫిక్, జావా అధ్యక్షుడు ఫయాజ్ షమా ఆధ్వర్యంలో వార్డు నెంబర్ 15, 16 ఖుర్షిద్‌నగర్‌కు చెందిన కాలనీ వాసులు, యువకులు, మహిళలు పార్టీలో చేరారు. అభ్యర్థి కంది శ్రీనివాస్‌తో కలిసి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ మంత్రి అనిస్ అహ్మద్, హాస్యనటుడు అక్బార్ బిన్ తబర్, మాజీ డీసీసీబీ చైర్మెన్ దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

అనిల్ గెలుపుకు ఓయూ జేఏసీ ప్రచారం

నవతెలంగాణ-తాంసి

బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ గెలుపు కోసం ఓయూ జేఏసీ నాయకులు మండలంలో ప్రచారం నిర్వహించారు. శనివారం జేఏసీ నాయకులు డా.ఎల్బల దత్తాత్రేయ సభ్యులతో కలిసి మండలంలోని జామిడి, బండల్ నాగపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. సీఎం కేసీఆర్ అభివృద్ధిని ఓటర్లకు వివరించారు. రైతు వేదికలు, రైతు బంధు, రైతు బీమా ఇస్తున్న ప్రభుత్వం బీఆర్ఎస్ అని గుర్తు చేశారు. బీఆర్ఎస్ బలపరిచిన అనిల్ జాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, కన్వీనర్ అరుణ్ కుమార్, నాయకులు దేవిదాసు, ఓయూ జేఏసీ నాయకులు పాండు జాదవ్, ఏలుగు ప్రేమేందర్, మర్రి వెంకన్న యాదవ్, మల్లెల స్వామి, సందీప్, ప్రశాంత్, ఎంపీటీసీ అశోక్, భోజన్న పాల్గొన్నారు.



తాంసిలో ప్రచారం నిర్వహిస్తున్న ఓయూ జేఏసీ నాయకులు

తలమడుగు : బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ తరపున మండలంలోని కుచలాపూర్ గ్రామంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పదేండ్లలో బీఆర్ఎస్ ఎంతో అభివృద్ధి చేసిందని నాయకులు అన్నారు. అనంతరం ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు, మేనిఫెస్టోను వివరిస్తు కారు గుర్తుకు ఓటేయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జ్ఞానేశ్వర్, ప్రభాకర్, వామన్, మహేందర్ యాదవ్, జనార్ధన్, సుదర్శన్, శ్రీనివాస్, సునీత రెడ్డి, అభిరామ్ రెడ్డి, గంగన్న, మంతెన శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 30 జరిగే అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేల పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్సై కిరణ్ తెలిపారు. శనివారం మండలంలోని గుంజాల, తాడిహత్నూర్ గ్రామంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం పంచాయితీ కార్యాలయంలో గ్రామ ముఖ్య నాయకులతో యూత్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అసాంఘిక కార్యకలపాలు కొనసాగితే డయాల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎలాంటి పుకార్లను నమ్మవద్దని, పోలీసులు భద్రత కోసం ఉన్నారన్నారు.

రూరల్ మండల్‌లో సంజీవ్‌రెడ్డి ప్రచారం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలో స్వతంత్ర అభ్యర్థి సంజీవ్ రెడ్డి ముమ్మర ప్రచారం నిర్వహించారు. శనివారం మండలంలోని ఖండాల గ్రామంలో కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షులు సాజిద్ ఖాన్, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గంట్రత్ సుజాతతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. మాజీ మంత్రి, దివంగత చిలుకూరి రామచంద్రా రెడ్డి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, ఆయన వారసుడిగా పోటిలో ఉన్నాని సంజీవ్ రెడ్డి తెలిపారు. ఈ సారి ప్రజలు ఆశీర్వాదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ అన్నారు. శనివారం మండలంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ప్రచారం చేపట్టారు. అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు వివరించారు. సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిట్లింగ్ నారాయణ, కల్లెడ భూమన్న, జహీర్, మల్లు, బిట్లింగ్ రజనీకాంత్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన మార్కండేయ యువజన సంఘం సభ్యులు



నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలోని మార్కండేయ యువజన సంఘం సభ్యులు శనివారం పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సంఘం సభ్యులు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎస్ భూమేష్, కోశాధికారి డి.భూమేశ్వర్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవరావు, గ్రామ సర్పంచ్ సుజాత నర్సారెడ్డి, శేఖర్‌రెడ్డి, నాయకులు ఈశ్వర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సెక్టార్ అధికారులకు శిక్షణ

నవతెలంగాణ-నిర్మల్

ఈవీఎం కమిషనింగ్‌పై సెక్టార్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్ ప్రారంభించి, మాట్లాడారు. సెక్టార్ అధికారులు ఈ శిక్షణలో చెప్పిన అంశాలను అవగాహన చేసుకొని, ఎన్నికలు ప్రశాంతంగా జరుగునట్లు చూడాలని తెలియజేశారు. మూడు అసెంబ్లీ నియోజక వర్గాల సెక్టార్ అధికారులకు జరిగిన ఈ శిక్షణలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌లపై పూర్తి స్థాయిలో మాస్టర్ ట్రైనర్‌లు బచ్చు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్‌లు ప్రాక్టికల్‌గా వివరించారు. మొత్తం 91 మంది సెక్టార్ అధికారులకు, అంతకుముందు పవర్ పాయింట్ ప్రాజెక్ట్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా నోడల్ అధికారి, డీఈఓ డా.ఏ.రవీందర్‌రెడ్డి, సమన్వయకర్త లింబాద్రి, అధికారులు పాల్గొన్నారు.

కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిశీలకులు రవి రంజన్ కుమార్, విక్రమ్, కే.గోపాలకృష్ణ సాధారణ పరిశీలకులు, లక్ష్మణ్ నింబర్గిలు శనివారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్, ఆదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన గదులను పరిశీలించి, తగు సూచనలు చేశారు. పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలిస్తూ, పలు సూచనలు చేశారు. అవసరమైన చోట సీసీ కెమెరాలు, లైటింగ్, ఫాన్స్ ఏర్పాటు చేయాలని, బ్యారీకేడ్లు, పార్కింగ్ వసతులు కల్పించాలని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఖర్చుల వివరాలను పరిశీలించిన వ్యయ పరిశీలకులు

నవతెలంగాణ-ముధోల్

ముధోల్‌లోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో శనివారం ఎన్నికల వ్యయ పరిశీలకులు శ్రేయస్ గుప్తా అభ్యర్థులు ఇది వరకు ఎన్నికల్లో ఖర్చుపెట్టిన ఖర్చుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల అభ్యర్థుల తరపున వచ్చిన వ్యక్తులు ఖర్చు వివరాలు వ్యయ పరిశీలకులకు అందజేశారు. 11 మంది అభ్యర్థులకు సంబంధించిన ఖర్చు వివరాలు అందజేసినట్లు అసిస్టెంట్ ఎన్నికల అధికారి అతికొద్దీన్ తెలిపారు.

పొరపాట్లు జరగకుండా విధులు నిర్వర్తించాలి



సమీక్షా సమావేశంలో పాల్గొన్న రిటర్నింగ్, నోడల్ అధికారులు

నవతెలంగాణ-నిర్మల్

ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ, పూర్తి అవగాహనతో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ఎన్నికల విధులు నిర్వర్తించాలని, రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు రిటైర్డ్ ఐఏఎస్ అజయ్ నాయక్, రిటైర్డ్ ఐపీఎస్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టరేట్ మిని సమావేశ మందిరంలో రాష్ట్ర పరిశీలకులు, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్‌లతో కలిసి రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పోలీస్, రెవెన్యూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో టీం వర్క్‌తో సమిష్టిగా ఎన్నికల కమీషన్ నియమావళి ప్రకారం నడుచుకోవాలని అన్నారు. శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచాలని ఆన్నారు. ఈవీఎంల నిర్వహణపై, బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్, తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాలెట్ పత్రాల ముద్రణలోనూ ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వద్దని అన్నారు. ఎన్నికల (ఈవీఎంలు, వీవీప్యాట్‌లను) పంపిణీ కేంద్రాల నుంచి పోలింగ్ ముగిసిన తరువాత రిసెప్షన్ సెంటర్లకు జాగ్రత్తగా తీసుకువెళ్లే విధంగా పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. సిబ్బందికి వాహనాలు ఏర్పాటు చేయాలని, పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు.అవసరమైన తాగునీరు, విద్యుత్ సరఫరా, ఫర్నీచర్, టాయిలెట్స్ వసతులను పరిశీలించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు.పీడబ్ల్యూడీ, సీనియర్ సిటిజన్స్‌కు ఫామ్-12 డీ ఇవ్వాలన్నారు. ప్రతి ఓటరుకు సమాచార స్లిప్పులను వంద శాతం పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, డీఎస్పీ గంగారెడ్డి, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, రిటర్నింగ్ అధికారులు, పోలీస్ అధికారులు, రవాణా శాఖ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

● కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు సూర్యవంశీ విలాస్



కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కుభీర్

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు సూర్యవంశీ విలాస్ అన్నారు. శనివారం చొండి, చోప్రా, గొడిసెర, భకోట్, సాంగ్వి, కార్యకర్తల కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2లక్షలు ఏకకాలంలో రైతు రుణమాఫీ, రైతులకు పెట్టుబడి సాయం కింద రైతుబంధు రూ.16వేలు, కూలి రైతులకు 12వేలు అందించేలా మహిళలకు వంట గ్యాస్ 500, విద్య భరోసా కింద రూ.5లక్షలు ప్రతి కుటుంబంలో ఉన్న మహిళలకు నెలకు రూ.2500 అదే విధంగా పెన్షన్ సదుపాయం రూ.4వేలకు పెంచేందుకు కాంగ్రెస్ కృషి చేస్తుందని అన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి ఒక్క హామీలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టు బడి ఉంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇస్తామని చెప్పిన మాట ప్రకారం సోనియా గాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చి మాట నిలబెట్టుకోవడం జరిగిందన్నారు. దీంతో ఇప్పుడు ఎన్నికలో ఇచ్చిన మాట ప్రకారం 6గ్యారంటిలను పక్కాగా అమలు చేసేలా ప్రణాళికలు రూపొందించడం జరిగిందని అన్నారు. దీంతో నియోజక వర్గంలో ఉన్న ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి నారాయణరావు పటేల్‌ను గెల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు విలాస్, జావిద్, సతీష్ గ్రామస్తులు ఉన్నారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తాం..



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి సతీమణి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అవకాశం ఇవ్వండి ఆదిలాబాద్ రూపురేఖలు మార్చగల సత్తా ఉన్నా తన భర్త కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి ఒక అవకాశమివ్వాలని కంది సాయిమౌనారెడ్డి ఒటర్లను అభ్యర్థించారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె పట్టణంలోని ఖానాపూర్, శాంతినగర్, కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీ హామీలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల సమయం దగ్గర పడిందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీని గెలిపించే బాధ్యత తీసుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో తమ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఏ షకీల్, తఖీమ్ ఖాన్, రహీంఖాన్, అమ్జాద్‌ఖాన్, నయింఖాన్, ముడుపు నళినిరెడ్డి, లత, స్వప్న, ప్రమీల, సుస్మిత, శరణ్య, అఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల భద్రతకే కవాతు

నవతెలంగాణ-ముధోల్

ప్రజల భద్రతకే కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని ఎస్సై మోహన్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నయబాధి చౌరస్తాలో కేంద్రబలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఎలాంటి అసాంఘిక చర్యలకు పాల్పడవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రబలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కౌటాల మండలం బోధంపల్లి గ్రామంలో శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో పది లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని పులబోయిన శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. అదేవిధంగా మండలంలోని గుండాయిపేట గ్రామంలో శ్రీనివాస్‌గౌడ్ కిరాణా దుకాణంలో తనిఖీ చేయగా అక్రమంగా ఉంచిన మద్యం బాటిళ్లు స్వాధీనమైనట్లు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్ఐ కిషన్, స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 001-సిర్పూర్ నియోజకవర్గం, 005-ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో జరుగునున్న ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని ఎన్నికల అధికారి బొర్కాడే హేమంత్ తెలిపారు. శనివారం ఎన్నికల పరిశీలకులు రాహుల్ మహివాల్, 001-సిర్పూర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, 005-ఆసిఫాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణులతో కలిసి ఎన్నికలలో విధులు నిర్వహించే సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన జరుగనున్న పోలింగ్ సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలింగ్ జరిగే రోజున ఆయా పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ద్వారా రికార్డింగ్ చేసేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలలో ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి 4 మంది చొప్పున సిబ్బందిని కేటాయించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు, పోలింగ్ రోజున ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఓటు హక్కు నియోగించుకునేందుకు పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సమీక్షలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి హేమంత్ బొర్కాడే

మాదిగలను మభ్యపెడుతూ కుట్ర పన్నుతున్న బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీజేపీ 2014లో అధికారంలోకి వచ్చే ముందు వందరోజుల్లో ఎస్సీ వర్గీకరణ పూర్తి చేస్తామని హామీ ఇచ్చిందని దానిని తుంగలో తొక్కి మరోసారి మాదిగలను మభ్యపెడుతూ వర్గీకరణ చేస్తామని చెప్పి మాదిగ సమాజాన్ని చీల్చే కుట్ర పన్నుతుందని టీఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మెన ధర్మయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో బాబు జగ్జీవన్ రావ్ కమిటీ హాల్లో జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల విశ్వరూప మహాసభలో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని మర్చిపోయిన బీజేపీ మళ్లీ హోం మంత్రి అమిత్ షా మాదిగలను మభ్యపెడుతూ మరోసారి మోసం చేస్తుందన్నారు. మాదిగ ఉపకులాలపైన చిచ్చు పెట్టి మరోసారి మాదిగలను మోసం చేయడానికి బీజేపీ నాయకులు తెలంగాణ ఎన్నికల సమయంలో కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. బీజేపీ కుట్రలను క్షేత్రస్థాయిలో ప్రచారం చేసి మాదిగలను చైతన్యవంతులను చేస్తామన్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా 10 సంవత్సరాలు ఒక్కసారి కూడా వర్గీకరణపై మాట్లాడకపోవడం వారి చిత్తశుద్ధిని తెలుపుతుందన్నారు. మాదిగలు ఐక్యంగా ఉండి మరోసారి బీఆర్ఎస్‌ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అంబాల రవి, రాష్ట్ర కార్యదర్శి శనిగరం మల్లేష్, మండల అధ్యక్షుడు మల్యాల అశోక్, వాంకిడి మండల అధ్యక్షుడు మోతే విలాస్, కెరమెరి మండల అధ్యక్షుడు సముద్రాల తిరుపతి, నాయకులు రేగుంట నరేష్, ఎగరపు తిరుపతి, బొమ్మెన శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని గూడెం గ్రామం జిల్లా ప్రాథమికోన్నత పాఠశాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో నాబార్డ్ వారి సౌజన్యంతో తెలంగాణ గ్రామీణ బ్యాంకు రవీంద్రనగర్ బ్రాంచ్ మేనేజర్ కిరణ్, ఫీల్డ్ ఆఫీసర్ సీఎచ్ రాజశేఖర్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళజాత బృందంచే ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు రవీంద్రనగర్ ఫీల్డ్ ఆఫీసర్ మాట్లాడుతు ప్రతి విద్యార్థి పది సంవత్సరాలు నిండిన వారు పీఎం, కేవైసీ అకౌంట్లు తీసుకోవాలని సామాజిక భద్రత పథకాలు, ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా, సురక్ష భీమా, అటల్ పెన్షన్ యోజన, ఇన్సూరెన్స్ ల పథకాల గురించి మ్యాజిక్ షో ద్వారా మాటల, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రైతులు జిల్లా ప్రాథమికోన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీఎస్పీ ప్రకాష్, వీఓలు జ్ఞానేశ్వర్, మోగ్దుం ఆలీ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

సాయంత్రం 4గంటల వరకే పోలింగ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

శాసనసభ నియోజకవర్గ ఎన్నికలలో భాగంగా ఈ నెల 30వ తేదీ పోలింగ్ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోగా నిర్వహించడం జరుగుతుందని అర్హత గల ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు ఖచ్చితంగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బొర్కాడే హేమంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ సమయాన్ని నిర్ణయించినట్లు, దివ్యాంగులు, వయోవృద్ధులకు పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంప్, వీల్ చైర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

రెండు అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

శాసనసభ నియోజకవర్గ ఎన్నికలలో భాగంగా ఈ నెల 30వ తేదీ జరుగనున్న పోలింగ్ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2 అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బొర్కాడే హేమంత్ సహదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 001-సిర్పూర్ నియోజకవర్గంలో 293 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 117-హడ్కిలి నుంచి 117-ఏ అదనపు పోలింగ్ కేంద్రాన్ని ఇటిక్యాల పహాడ్ లో, 005-ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో 304 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 171- పంగిడి మాదర నుండి 171-ఏ అదనపు పోలింగ్ కేంద్రాన్ని బుగ్గగూడలో ఓటర్లకు అనుకూలంగా ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ విషయాన్ని ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లు గమనించి ఓటు హక్కు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

ఓపెన్ వర్సిటీ డిగ్రీ తరగతులు ప్రారంభం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు థియరీ తరగతులు ప్రారంభమైనట్లు ఎస్‌కెఈ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 7382929651, 9866398678 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

21న మహాపాదయాత్ర

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 21న సిర్పూరు (టి) మండలంలోని సిద్ది టోంకిని హన్మాన్ దేవాలయం వరకు 22వ మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మహవీర్‌ప్రసాద్‌లోయ ఒక ప్రకటనలో తెలిపారు. కాగజ్‌నగర్‌లోని హన్మాన్ మందిర్ నుండి ప్రారంభమయ్యే ఈ పాదయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ గెలుపుకు వైఎస్ఆర్‌టీపీ కృషి



నవతెలంగాణ-మందమర్రి

కాంగ్రెస్ గెలుపు కోసం వైఎస్ఆర్‌టీపీ కృషి చేస్తుందని ఆ పార్టీ జిల్లా నాయకులు తెలిపారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల మద్దతు ఇచ్చిన నేపథ్యంలో మంచిర్యాల జిల్లా వైఎస్ఆర్‌టీపీ నాయకులు శనివారం మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌టీపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అజీమొద్దీన్, సుద్దాల ప్రభుదేవ్ మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులు పాఠశాల క్రీడా సమాఖ్య రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ అండర్-17 పోటీలకు ఎంపికైనట్లు మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ అందే నాగ మల్లయ్య తెలిపారు. మోడల్ కళాశాల ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు శంకర్ గౌడ్, ప్రశాంత్‌లు ఎంపికైనట్లు వివరించారు. మంచిర్యాలలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి ఫుట్ బాల్ అండర్-17 విభాగంలో ప్రతిభ కనభరిచి మహబూబాబాద్ జిల్లా జడ్చర్లలో జరిగే క్రీడా సమాఖ్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య, పీఈటీ శ్రీనివాస్ గౌడ్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కాంగ్రెస్‌లోకి కోమటిచేను సర్పంచ్



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కోమటిచేను గ్రామ పంచాయతీ సర్పంచ్ రామటెంకి శ్రీనివాస్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి మాజీ మంత్రి గడ్డం వినోద్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా వినోద్ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పేద బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ వంశీకృష్ణరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు

నవతెలంగాణ-లక్సెట్టిపేట

గ్రామాల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని మంచిర్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శనివారం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ప్రతి ఇంటికి కి వెళ్లి సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమాభివృద్ధిని, అలాగే బీఆర్ఎస్ మెనిఫెస్టోను ప్రజలకు వివరించినరు. మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది అని పేర్కొన్నారు. మీ అందరి సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని, నవంబర్ 30వ తేదిన జరిగే ఎన్నికల్లో కారు గుర్తును ఓటు వేసి భారీ మెజారిటీలో ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు గంగుల రామ్మూరి పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్పులు సకాలంలో పంపిణీ చేయాలి

నవతెలంగాణ-తాండూర్

పంచాయతీల పరిధిలో ఓటర్లకు ఓటర్ స్లిప్పులను సకాలంలో పంపిణీ చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ సూచించారు. శనివారం కొత్తపల్లి పంచాయితీని సందర్శించి బూతు స్థాయి అధికారులకు కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి సౌకర్యాలను పర్యవేక్షించారు. పోలింగ్ తేదీన వచ్చే అధికారులకు అన్ని రకాల అసౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వచ్చే సంవత్సరానికి గాను ఏర్పాటు చేయబోతున్నటువంటి నర్సరీకి సంబంధించి మట్టి ఎరువు మిశ్రమం తయారుచేసి పెట్టుకోవాల్సిందిగా సూచించారు. ఈ పర్యటనలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, బీఎల్ఓలు శ్యామల, రజిత, ప్రమీల పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలించిన

నవతెలంగాణ-లక్సెట్టిపేట

లక్సెట్టిపేట మండలంలోని పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ రాఘవేంద్రరావు పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బూత్ స్థాయి అధికారులు అందరూ కూడా ప్రతి ఇంటికి వెళ్ళి ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లీప్‌లను పంపిణీ చేయవల్సిసిందిగా సూచించారు. ఈ ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లీప్‌లో ఓటరుకు సంబంధించిన వివరాలు అన్ని ఉన్నాయి. పోలింగ్ తేదీ సమయం కూడా ముద్రించి ఉన్నాయి అని చెప్పారు. ప్రతి ఓటరుకు ఈ ఓటరు ఇన్ఫర్మేషన్ స్లీప్‌లను పంపిణి చేస్తామని పేర్కొన్నారు. ప్రతి ఓటరు యొక్క సంతకం తీసుకోవాలని బీఎల్ఓలను ఆదేశించారు. అన్ని స్లిపులు ఒక్కరికే ఇవ్వకుండా ఎవరి స్లిప్‌లు వారికే ఇవ్వాలని తెలిపారు. ఓటర్లు అందరూ వారి ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లీప్‌లను పరిశీలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవేంద్రరావుతో బాటు ఆర్ఐ సమ్మక్క, బీఎల్ఓ లత పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- బెల్లంపల్లి ఏసీపీ సదయ్య

నవతెలంగాణ-తాండూర్

ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని బెల్లంపెల్లి ఏసీపీ సదయ్య తెలిపారు. శనివారం తాండూర్ సీఐ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్సీ కాలనీ, మన్నేవాడ, గౌండ్లవాడ, బోయవాడ, బారేవాడలో మహిళా సీఆర్పీఎఫ్ బెటాలియన్‌లతో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. ఓటర్లు ఒత్తిడులకు లొంగకుండా తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకుగాను సబ్ డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్‌లను బైండోవర్ చేయడం జరిగిందన్నారు. అక్రమ మద్యం అనుమతి లేని నగదు రవాణను అరికట్టేందుకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని తాండూర్ బెల్లంపల్లి సర్కిల్ పరిధిలోఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో సీఆర్పీఎస్ జవాన్లతో కలిసి కవాతు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని రకాల కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. కవాతు కార్యక్రమంలో తాండూర్ సర్కిల్ పరిధిలోని 47 మంది పోలీసులు 24 మంది సీఆర్పీఎఫ్ మహిళ జవాన్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కన్నెపల్లి ఎస్సై నరేష్, మాదరం ఎస్సై అశోక్, తాండూరు ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బెల్లంపెల్లి ఏసీపీ సదయ్య

పట్టణంలో కాంగ్రెస్ విస్తృత ప్రచారం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక బీజోన్ సెంటర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో శనివారం కాంగ్రెస్ నాయకులు విస్తతంగా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో మాజీ ఎంపీ గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీ పాల్గొని వ్యాపారస్తులకు కాంగ్రెస్ 6 గ్యారంటీ పథకాలను వివరించారు. ఈ నెల30న జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ హస్తం గుర్తుకు ఓటు వేసి చెన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి వివేక్ వెంకటస్వామిని బారి మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పీసీసీ ప్రధాన కార్యదర్శి పిన్నంటి రఘునాథ్ రెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపిస్తేనే మరింత అభివృద్ధి

నవతెలంగాణ-జన్నారం



కారుగుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపిస్తే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ డైరెక్టర్ బాదావత్ పూర్ణచంద్రనాయక్ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని మహమ్మదాబాద్ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు రైతు బీమా రైతు బంధు లాంటి పథకాలు పెట్టి దేశానికే ఆదర్శగా నిలిచారన్నారు. సౌభాగ్య లక్ష్మీ పథకంలో ప్రతి పేదింటి మహిళకు మూడు వేల రూపాయల నగదును అందిస్తామన్నారు. వృద్ధులకు ఆసరా పెన్షన్ కింద రూ.5000 అందిస్తామన్నారు. రూ.400 కే సిలిండర్ ఇస్తామని, ఖానాపూర్ నియోజకవర్గంలో కారు గుర్తుకు ఓటు వేసి భూక్య జాన్సన్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాంటెన్కి శంకర్, శ్రీకాంత్‌రెడ్డి, కమ్మల విజయ ధర్మ పాల్గొన్నారు.

బీఎస్పీని గెలిపిస్తే రూ.15 లక్షల ఆరోగ్య బీమా

నవతెలంగాణ-జన్నారం

బీఎస్పీని గెలిపిస్తే ప్రతి కుటుంబానికి రూ.15 లక్షల వరకు నూరేళ్ల ఆరోగ్య భీమా పథకాన్ని అమలు చేస్తామని ఆ పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి బన్సీలాల్ రాథోడ్ అన్నారు. శనివారం మండలంలోని రాంపూర్, మహ్మదాబాద్, తిమ్మాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. బీఎస్పీ ఏనుగు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించినట్లయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు పేదలకు ఉచిత విద్య వైద్యాన్ని అందిస్తామన్నారు. భీమ్ రక్షా కేంద్రాల ద్వారా వృద్ధులకు హాస్టల్లు, ఆహారం, ఉచిత వైద్యం అందిస్తామన్నారు. రక్ష కేంద్రాల ద్వారా వికలాంగులకు ఒంటరి మహిళలకు తోడ్పాటున అందిస్తామన్నారు. భూమిలేని ప్రతి నిరుపేదకు ఎకరం భూమి అందిస్తామన్నారు. ఆ భూమిని మహిళల పేరిట పట్టా చేస్తామన్నారు. ఏనుగు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

నవతెలంగాణ-మందమర్రి



సింగరేణి మహిళా కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ మంజునాథ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథులుగా మందమర్రి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మహేందర్ రెడ్డి, ఎస్సై చంద్రకుమార్‌లు హాజరయ్యారు. సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ మంచి ప్రవర్తనతో చదువుకుంటే మంచి ఉద్యోగాలు సంపాదించవచ్చునని, అదేవిధంగా ఆడ పిలలు సోషల్ మీడియలో ఎక్కువగా ఉండకూడదని చాలమంది పోకిరీలు ఆడ పిల్లలను ట్రాప్ చేస్తున్నారని మందమర్రిలో ఎక్కువగా అమ్మాయిల మిస్సింగ్ కేసులు వస్తున్నాయని తల్లిదండ్రులను తలదించుకునే పనులు చెయ్యవద్దని, ద్వితీయ సంవత్సరం విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని మొదటి సంవత్సరం విద్యార్థులు మంచి మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంక్‌లను సాధించాలని సూచించారు. కళాశాలలో అవగాహనా సదస్సను నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం జరిగిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేసారు. ఈ కార్యక్రమానికి కళాశాల కరెస్పాండంట్ హీరాలాల్, కళాశాల ప్రిన్సిపాల్ పి.సుష్మ, సిహెచ్ రాజేశం, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోర్టు స్థలం పరిశీలన

నవతెలంగాణ-మందమర్రి

హైకోర్టు ఆదేశాల మేరకు మందమర్రి పట్టణంలో ఏర్పాటు చేయనున్న నూతన జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు కేటాయించిన స్థలాన్ని శనివారం జిల్లా న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి రామ బ్రహ్మాచారిలు పరిశీలించారు. పట్టణంలోని సీఐఎస్ఎఫ్ క్యాంపులోని సదుపాయాలను పరిసర ప్రదేశాలు పక్కన ఉన్న ఆలయం పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా జీఎం మనోహర్, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చంద్రకుమార్, సింగరేణి సెక్యూరిటీ అధికారులు, సివిల్ ఇంజినీర్లు, లాయర్లు పాల్గొన్నారు.



ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

• రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల పరిశీలకులు అజయ్ వి. నాయక్



అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల పరిశీలకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేల ప్రతి ఒక్కరు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల పరిశీలకులు అజయ్ వి.నాయక్, పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్, ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి, అధికారులు పరిశీలకులకు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్ల గురించి కలెక్టర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 25 మంది, బోథ్ నియోజకవర్గంలో 10 మంది అభ్యర్థులు ఎన్నికల పోటీలో ఉన్నట్టు తెలిపారు. ఆదిలాబాదులో 2,40,326 ఓటర్లకు 290 పోలింగ్ కేంద్రాలు, బోథ్‌లో 2,08,048 మంది ఓటర్లకు 302 పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసినట్టు వివరించారు. అందులో 80 సంవత్సరాలకు పైబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లు 551, వైకల్యం కలిగిన దివ్యాంగ ఓటర్లు 214 మంది ఇంటి నుండి ఓటు వేసేందుకు దరఖాస్తులు చేసుకున్నారని, ఈ మేరకు వారి ఇళ్ల వద్దకే బృందాలను పంపించి ఓటింగ్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకుంటామన్నారు. 10 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే ఈవీఎం, పోలింగ్ సిబ్బంది కేటాయింపులకు సంబంధించిన ర్యాండమైజేషన్ పూర్తయ్యిందన్నారు. సువిధ యాప్‌లో దరఖాస్తులను, సి-విజిల్ యాప్‌లో ఫిర్యాదులను, ఎంసిఎంసి ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా లో ప్రకటనలకు సంబంధించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని పరిశీలకులకు తెలియజేశారు.

పోలింగ్ కేంద్రాలలో తగిన ఏర్పాట్లు చేయాలి..

రాష్ట్ర సాధారణ, పోలీస్ ప్రత్యేక పరిశీలకులు మాట్లాడుతూ ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుందుకు పోలింగ్ కేంద్రాలలో తగిన ఏర్పాట్లు చేయాలనీ సూచించారు. ఎన్నికల నిబంధనలను పాటించాలని, ఎన్నికల కమిషన్ పాసులు కలిగి ఉన్న వారిని మినహాయించి, ఇతరులు ఎవరినీ పోలింగ్ కేంద్రంలోనికి అనుమతించవద్దన్నారు. బందోబస్తు విధులు నిర్వర్తించే సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించరాదని, పోలింగ్ స్టేషన్ల సమీపంలో ఓటర్లను ఒత్తిడి చేయకుండా కట్టుదిట్టమైన నిఘా ఉంచాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘాను ఏర్పాటు చేయాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బు గుప్త, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, రిటర్నింగ్ అధికారులు చాహత్ బాజ్‌పాయ్, స్రవంతి అధికారులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

• కాలనీల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్


ఫ్లాగ్ మార్చ్ అనంతరం ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో రూరల్ సీఐ సైదరావ్ ఆధ్వర్యంలో 50 మంది క్యూఆర్టీ స్పెషల్ బృందాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కేఆర్‌కే కాలనీ నుంచి మొదలై కవాతు పిట్టలవాడ, దోబీ కాలనీ, కైలాస్ నగర్‌లోని ప్రధాన కూడల్లో ఓటు హక్కుపై ప్రాధాన్యత, భద్రతకి పోలీసులున్నారే నమ్మకాన్ని కలిగిస్తూ ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా ప్రజలను అవగాహన కల్పించడానికి కవాతు నిర్వహించామని సీఐ సైదరావ్ తెలిపారు. ఎన్నికల సమయంలో పుకార్లను ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఎన్నికల సమయంలో రెచ్చగొట్టే మాటలు మాట్లాడిన, గొడవలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మావల ఎస్సై విష్ణువర్ధన్, రిజర్వ్ ఎస్సై మహేందర్, క్యూఆర్టి, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

బేల : ఎన్నికల సందర్భంగా మండలంలోని చప్రాల, పాటన్ గ్రామాల్లో పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. ప్రజలు ఎన్నికల నిబంధనలను పాటించాలని, ప్రజాస్వామ్య దేశంలో ఓటు చాలా విలువైనదని ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు వినియోగించుకోవాలని కోరుతూ కవాతు కొనసాగింది. ఈ కవాతులో సీఐ కోల నరేష్, ఎస్సై రాధిక, ఏఆర్ రిజర్వ్ ఎస్సై రాకేష్ పాల్గొన్నారు.

చెన్నూర్‌లో హోరాహోరీ ప్రచారం


ప్రచారంలో భాగంగా చేరికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ అసెంబ్లీలో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు హోరాహోరీ ప్రచారం చేస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. కాంగ్రెస్ నుండి పెద్దపల్లి మాజీ ఎంపీ గడ్డం వివేక్ వెంకటస్వామి, బీఆర్ఎస్ నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీజేపీ నుంచి దుర్గం అశోక్, బీఎస్పీ నుంచి డాక్టర్ దాసారపు శ్రీనివాస్ పోటీ చేస్తున్నారు. తమ ఉనికిని చాటేలా పార్టీల అభ్యర్థులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. పట్టును పటిష్టపర్చుకోవడం కోసం ప్రయత్నిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ మరోసారి అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. మరో పక్క కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి కారును పంక్చర్ చేయాలని ప్రయత్నిస్తున్నాడు. నియోజకవర్గ పరిధిలో గల మందమర్రి, రామకృష్ణాపూర్, చెన్నూర్ మున్సిపాల్టీలతో పాటు భీమారం, జైపూర్, కోటపల్లి మండలాల్లో నేరుగా ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. ప్రధాన పార్టీలకు ధీటుగా స్వతంత్రులు ముగ్గురితో పాటు ధర్మ సమాజ్, ఆల్ ఇండియా మహిళా ఎంపవర్‌మెంట్, సోషలిస్టు, తెలంగాణ రాజ్య సమితి, బహుజన్ విముక్తి, ప్రజా రాజ్య సమితి, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీల అభ్యర్థులు కూడా ముమ్మర ప్రచారాలు చేస్తున్నారు. నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య పోటీ ఉంటుందని తెలుస్తోంది. నువ్వా..నేనా అన్నట్టుగా తలపడుతున్న ఇరు పార్టీ అభ్యర్థుల గెలుపులో బీజేపీ అభ్యర్థి చీల్చే ఓట్లు ఈ అభ్యర్థుల విజయంపై ప్రభావం చూపే అవకాశముంది.

పరస్పర విమర్శలతో అభ్యర్థుల ప్రచారం..

కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారంలో పరస్పరం విమర్శించుకోవడం కన్పిస్తోంది. ఎక్కడ కార్నర్ మీటింగ్ జరిగిన సరే ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. సోషల్ మీడియా వేదికగా అభ్యర్థులు పెడుతున్న పోస్టులు సామాన్యులను సైతం విస్మయానికి గురి చేసేవిధంగా ఉంటున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. అభ్యర్థులకు మాత్రమే పరిమితం కాకుండా కుటుంబ సభ్యులను ప్రచారంలో లాగుతున్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి

చట్టాలపైన అవగాహన పెంపొందించుకోవాలి


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థి దశ నుంచే చట్టాలపైనా అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.2లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. దీనికి ఆయన జిల్లా జడ్జి ముఖ్య అతిథిగా హాజరై పలు చట్టాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులతో పాటు సైబర్ నేరాలు, చట్టాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇప్పటి నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుంటు ఆ దిశగా కష్టపడి చదవాలని సూచించారు. మొబైల్ ఫోన్‌లను వాడకుండా చదువుపై శ్రద్ద పెట్టాలన్నారు. నిత్యం పాఠశాలలకు వచ్చి ఉపాధ్యాయులు చెప్పే వాటిని వినాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు న్యాయమూర్తి డాక్టర్ శివరామ్ ప్రసాద్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమ దేశపాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రాల నగేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు డిగ్రీ విద్యార్థులు

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో అవసరమైన నైపుణ్యాలను పెంచడానికి రాష్ట్ర వ్యాప్తంగా కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన "పిల్లల కోసం" కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల నుంచి వంద మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు శనివారం ఆయా పాఠశాలలకు వెళ్లి ప్రాథమిక స్థాయి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను



అభివృద్ధి చేయనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో పిల్లల కోసం కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ సిహెచ్ రాజు, జిల్లా కోఆర్డినేటర్ టి.దత్తాత్రేయ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.22 వేల మద్యం పట్టివేత

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఎన్నికల నేపథ్యంలో బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మండలంలో మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు ఓ షాపులో దాడి నిర్వహించి రూ.22 వేల 200 విలువ గల మద్యాన్ని పట్టుకున్నారు.

ఇందల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలు తరువాత ఇందల్‌పై రెండు సార్లు కేసులు నమోదయ్యాయి. కోడ్ ఉన్న నేపథ్యంలో ప్రజలు అసంఘిక కార్యక్రమాలు, అక్రమ మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై సునీల్ హెచ్చరించారు.

ఓటర్ల స్లిప్పుల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలి



నవతెలంగాణ-కాసిపేట

శాసనసభ నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 30న పోలింగ్ జరుగనున్నందున ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం మండలంలోని దేవాపూర్‌లో ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ భోజన్న, ఎంపీడీఓ అలీంతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్‌కు సంబంధించి ఓటరు స్లిప్పులు పంపిణీని వేగవంతంగా బీఎల్‌ఓలు పంపిణీ చేయాలన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓలు వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి తప్పులకు అస్కారం లేకుండా పంపిణీ చేయాలన్నారు.

రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

- ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్ దత్తా



మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్ దత్తా

నవతెలంగాణ-నస్పూర్

శాసనసభ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయిందని ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్ దత్తా అన్నారు. శనివారం మంచిర్యాల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల రెండవ విడత ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24 గంటల పాటు బందోబస్తు ఉంటుందని, ప్రతి స్ట్రాంగ్ రూమ్‌కు డబుల్ లాక్ సిస్టమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణకు నియోజకవర్గంలో 289 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అగ్నిమాపక, పోలీసు శాఖల సమన్వయంతో భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వెబ్ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. పోలింగ్ రోజు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి రాములు, సహాయ రిటర్నింగ్ అధికారి సంధ్యారాణి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అగ్రవర్ణ ఆధిపత్యానికి చరమగీతం పాడాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి కావస్తున్న నియోజకవర్గంలో అగ్రవర్ణాల ఆధిపత్యంతో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, వారి ఆదిపత్యానికి చరమగీతం పాడాల్సిన సమయం వచ్చిందని ప్రజా సంఘాల ఐక్యవేదిక అడ్వైజర్ రజి హైదర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని 40 సంవత్సరాల నుండి వెల్మ, కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారే పరిపాలిస్తున్నారని తెలిపారు. జనాభాలో మూడు శాతం ఉన్న వారే పరిపాలించడం కారణంగా బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగడం లేదన్నారు. ప్రజలు ఆలోచించి, నియోజవర్గం అన్ని రంగాలల్లో అభివృద్ధి చెందాలంటే, జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో



గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు అల్లి రాజయ్య, ప్రధాన కార్యదర్శి అంబాల ఓదెలు, అడ్వకేట్ కే కిషోర్ పాల్గొన్నారు.

మండలంలో మాజీ మంత్రి ఎన్నికల ప్రచారం



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌కు ఓటు వేయాలని కోరుతూ మాజీ మంత్రి బోడ జనార్ధన్ మండలంలో ప్రచారం చేపట్టారు. బెజ్జాల, కుందారం గ్రామాలలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టిన ఆయన తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలంటే బాల్క సుమన్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మేడి సునిత తిరుపతి, పార్టీ అధ్యక్షులు బలమూరి అరవిందరావు, ప్రధాన కార్యదర్శి పాలమాలకు సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి పట్టాలిప్పించే బాధ్యత నాది

- ఎమ్మెల్యే దివాకర్ రావు



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి ప్రాంతంలో నివసిస్తున్న 3500 మందికి పట్టాలు ఇప్పించామని, పట్టాలు రాని ప్రతి ఒక్కరికి పట్టాలు ఇప్పించే బాధ్యత తను అందిచేల కృషి చేస్తానని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని కొత్త రోడ్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను గెలిచిన వెంటనే అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మెన్ ఈసంపల్లి ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కౌన్సిలర్లు వంగ తిరుపతి, బేర సత్యనారాయణ, పూదరి కుమార్, బౌతూ లక్ష్మి, టీబీజీకేఎస్ నాయకులు సురేందర్ రెడ్డి, అన్నయ్య, మల్లారెడ్డి, రవీందర్ రెడ్డి, నాయకులు ఎండి రఫీక్ ఖాన్, కొండపర్తి శంకర్, రవి గౌడ్, పెరిక సత్తయ్య, రాజు నాయక్, గుమ్మడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మరో అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి కొనసాగిస్తా..



నవతెలంగాణ-భీమారం

ప్రజలు మరోమారు అవకాశం ఇస్తే జరుగుతున్న అభివృద్ధిని కొనసాగిస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ ప్రజలను కోరారు. శనివారం మండల పరిధిలోని ఖాజీపల్లి, దాంపూర్, రెడ్డిపల్లి, ధర్మారం, గోత్రాల గూడెం, నర్సింగాపూర్, బూరుగుపల్లి, పోతన్‌పల్లి, ఆరెపల్లి, మద్దికల్, ఎల్బీపేట్ గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రచార వేదికల్లో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలతో పాటు వచ్చే ఎన్నికల్లో మరోసారి ప్రభుత్వం ఏర్పడితే వచ్చే సంక్షేమ పథకాలను వివరించారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఆవుడం క్రాస్ రోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చెరుకు సర్వోత్తంరెడ్డి, పార్టీ అధ్యక్షడు కలగూర రాజ్‌కుమార్, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, రాజ్‌కుమార్ నాయక్, కొమ్ము అశోక్ యాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

జై భీం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమిలో జై భీమ్ జిల్లా నూతన కమిటీ ఎన్నికలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా జాడి వినోద్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యంగా ఉంటూ హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. ఉద్యమ వీరులు కుమురం భీం, కుమురం సూరుల స్ఫూర్తితో హక్కులు, చట్టాల సాధనకు కమిటీ తరపున ఆదివాసీలను చైతన్యవంతులను చేస్తామన్నారు. విద్యతో పాటు ఆయా రంగాల్లో రాణించేల సంఘం తరపున అవగాహన కార్యకమాలు చేపడుతామన్నారు. అనంతరం జిల్లా కమిటీ అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా జాడి అశోక్, ప్రధాన కార్యదర్శిగా దుర్గం సుధాకర్, ఉపాధ్యక్షులుగా దుర్గం అతీష్, జాడి శ్రీకాంత్, దుర్గం ఆకాష్, దుర్గం రమేష్, జాడి ప్రమోద్, సంయుక్త కార్యదర్శిలుగా దుర్గం విలాస్, కట్కర్ గౌతమ్, దుర్గం నవీన్, చునర్కర్ ప్రశాంత్, అధికార ప్రతినిధులుగా జాడి



భరత్, జాడి సురేష్, కార్యదర్శులుగా దుర్గం వెంకటేష్, దుర్గం నితిన్, చునార్కర్ దీపక్, కట్కర్ భీమ్రావు, ముఖ్య సలహాదారులుగా ముంజం సాంబయ్య, జాడీ కృష్ణాజి, చైతన్య తేమాజి, పెంటయ్య, హుక్కు, తుకారం ఎన్నికైనట్టు ఆయన పేర్కొన్నారు.

మూడోసారి అధికారం ఇవ్వాలి

నవతెలంగాణ-రెబ్బెన

బీఆర్ఎస్‌ను మూడోసారి అధికారం ఇచ్చేల ప్రజలు సహకారం అందించాలని నాయకులు కోరారు. శనివారం మండలంలో గోలేటి గ్రామంలో సర్పంచ్ పోటు సుమలత శ్రీధర్ రెడ్డి ఇంటింటికి తిరుగుతూ మేనిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కారు గుర్తుకు ఓటేసి ఆసిఫాబాద్



అభ్యర్థి కోవ లక్ష్మిని గెలిపించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మరిన్నీ సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.